క్లుప్తంగా

రైతు భరోసా కేంద్రం తనిఖీ



అవుటాల రమణారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్బీకే సిబ్బంది

హిందూపురం అర్బన్: మండలంలోని సంతేబిదనూరు రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డి తనిఖీ చేశారు. ఆర్బీకే పరిధిలో ఎన్ని గ్రామాలున్నాయి? ఎంత మంది రైతులు ఉన్నారు? రైతులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆయన వెంట ఏఓ సురేంద్రనాయక్, హెచ్ఓ అనిల్‌కుమార్, వీఎస్ఏ సాయికుమార్ ఉన్నారు.

సామాజిక తనిఖీపై గ్రామ సభలు

రొళ్ల: మండల పరిధిలోని మల్లినమడుగు, బొమ్మగొండనహళ్లి, ఎం.రాయాపురం, దొడ్డేరి పంచాయతీ కేంద్రం ఆవరణలో సోమవారం సామాజిక తనిఖీలో భాగంగా గ్రామ సభలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 2022 ఏప్రిల్ 31 నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకూ జరిగిన ఉపాధి, ఇతరాత్ర పనులు 453 జరిగాయని సామాజిక తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. రూ.65.91 లక్షలు ఖర్చు చేశామన్నారు. చేసిన పనులకు వెచ్చించిన ఖర్చుకు తేడా ఉంటే తెలియజేయాలన్నారు. త్వరలో సామాజిక తనిఖీలో వెల్లడైన అంశాలను ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో వెల్లడి చేస్తామన్నారు.

ఘనంగా సావిత్రీ బాయి పూలే జయంతి



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘం నాయకులు

పావగడ: దేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయి పూలే జయంతిని సోమవారం స్థానిక మార్కెట్‌యార్డులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు డీజేఎస్ నారాయణప్ప, సుబ్బరాజు, టీఎన్ పేటే రమేశ్, నరసింహప్ప తదితరులు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు పూలే సేవలను కొనియాడారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా

మడకశిరరూరల్: మండలంలోని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీవుల్లా ఆదేశించారు. సోమవారం కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధులు, మలేరియా, ఫైలేరియాపై వైద్య సిబ్బందితో సమావేశమై పలు సూచనలు, సలహాలిచ్చారు. వైద్యులు మాధుర్య, వినోద్‌కుమార్, సీహెచ్ఓ హుస్సేన్, సూపర్‌వైజర్ రామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా కింద రూ.5 లక్షల అందజేత



లక్ష్మీనరసమ్మకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని 17వ వార్డుకి చెందిన లక్ష్మీనరసమ్మకు సోమవారం వైఎస్సార్ బీమా పథకం కింద రూ.5 లక్షల చెక్కు అందజేశారు. గత ఏడాది లక్ష్మీనరసమ్మ భర్త మెట్ల బండప్ప మృతి చెందారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మృతుడి భార్యకు రూ.5 లక్షలు మంజూరు చేసింది. ఈ చెక్కును కౌన్సిలర్ సుభద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మీపతిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేంద్ర తదితరులు అందించారు.

నిర్మాణాలు పూర్తి చేయండి



రొద్దంలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాన్ని సోమవారం హౌసింగ్ అధికారులు పరిశీలించారు. నిర్మాణ సమస్యలపై లబ్ధిదారులతో అడిగి తెలుసుకున్నారు. స్లాబులు, పునాదుల వరకూ నిర్మించి మధ్యలోనే వదిలేసిన లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఖాజామైనుద్దీన్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రంగస్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పండువలా పింఛన్ల పంపిణీ

- ఇచ్చిన మాట నిలుపుకున్న నాయకుడు వైఎస్ జగనే : మంత్రి ఉషశ్రీచరణ్
- రూ.3 వేలు పింఛన్ చేతికందడంతో లబ్ధిదారుల హర్షం



పెనుకొండ: సామాజిక పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ మంగమ్మ

పెనుకొండ రూరల్: ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పింఛన్లను రూ.3 వేలకు పెంచి అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని మంత్రి, పెనుకొండ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ అన్నారు. సోమవారం మండలంలోని మునిమడుగు గ్రామంలో నూతన పింఛన్ల పంపిణీలో ఆమె పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని గవి మల్లప్ప కొండలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సచివాలయం వద్ద నూతన పింఛన్ల పంపిణీలో ఆమె మాట్లాడారు. పేదల పాలిట సంక్షేమ వరాలు కురిపించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. అనంతరం గుట్టూరులో జెడ్పీటీసీ శ్రీరాములు ఇంట్లో తేనీటి విందులో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ మంగమ్మ, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, వైస్ ఎంపీపీ చంద్రకళ, సర్పంచ్ అశ్వర్థనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాబు, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కర్రా సంజీవరెడ్డి, వెంకటరాముడు, నడిపి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: రాష్ట్రంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందని పలారం సర్పంచ్ సతీష్ పేర్కొన్నారు. సోమవారం సచివాలయం వద్ద పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: మడకశిర మున్సిపాలిటీలోని 7 వార్డులో సోమవారం వలంటీర్లు, అధికారులు లబ్ధిదారులకు రూ.3 వేల పింఛన్ పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వార్డులో ఇంటింటికీ వెళ్లి లబ్దిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. రూ.3 వేల పింఛన్ చేతికి అందడంతో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జయరాజ్, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని 20 సచివాలయాల పరిధిలోని 154 మంది లబ్దిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లను సోమవారం పంపిణీ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ ప్రమీల, ఎంపీడీఓ రఘునాథగుప్తా పింఛన్లను అందజేశారు.

అగళి: అవ్వాతాతల ముఖాల్లో చిరున నవ్వు చూడడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం వైఎస్సార్ పింఛన్లు కానుక పెంపు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.3000 చొప్పున లబ్దిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ రవిప్రసాద్, సర్పంచులు లక్ష్మమ్మ, రామకృష్ణప్ప, ముద్దరాజు, వైస్ ఎంపీపీ గాయంత్రి, ఎంపీటీపీ మంజుళ, జేసీఎస్ కన్వీనర్ శివన్న తదితరులు పాల్గొన్నారు.



గోరంట్ల: నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ ప్రమీల

అనంతకు వెళ్లి...



మడకశిరరూరల్: మండల పరిధిలోని జిల్లెడుగుంటకి చెందిన వలంటీర్ చంద్రకళ అనంతపురానికి వెళ్లి సోమవారం వృద్ధుడు తిప్పేనరసప్పకు రూ.3 వేల పింఛన్ అందజేశారు. తిప్పేనరసప్ప అనారోగ్యంతో అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ చంద్రకళ అనంతపురం వెళ్లి పింఛన్ డబ్బు అందజేశారు.



మడకశిరలోని 7వ వార్డులో పింఛన్లు పంపిణీ చేస్తున్న అధికారులు



అగళిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ నళిని



గుడిబండ మండలం పలారంలో పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

'ఆడుదాం ఆంధ్రా' కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామ సచివాలయంలో 'ఆడుదాం ఆంధ్రా' కిట్లను సోమవారం ఎంపీపీ ఈరన్న ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడలు ముగిశాయన్నారు. ఇందులో ప్రతిభ కనబరచిన వారికి ఈ నెల 10న మండలస్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన టీ షర్టులు, క్రీడా పరికరాలను ఆయన క్రీడాకారులకు అందించారు.

ఇంటింటికీ రాముడి అక్షింతలు



హెచ్‌డీ హళ్లిలో అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అగళి: అయోధ్య రాముడి అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేసే కార్యక్రమం మండలంలో జోరుగా సాగుతోంది. అయోధ్య శ్రీరాముడి పవిత్ర అక్షింతలను ధర్మ రక్షా సమితి శ్రీరామ భక్తులు సోమవారం కూడా ప్రజలకు అందించారు. ప్రతి ఇంటికీ అక్షింతలు అయోధ్య శ్రీరాముడి ఫొటో, ఆహ్వాన పత్రిక, హనుమాన్ జెండాను అందిస్తున్నారు. అక్షింతల పవిత్రతను కూడా వివరిస్తున్నారు. 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్టను తెలియజేస్తూ ఆ రోజు శ్రీరాముడి చిత్రపటం వద్ద పూజ చేసి ఐదు దీపాలను వెలగించాలని సూచించారు.

చిలమత్తూరులో మోస్తరు వర్షం

చిలమత్తూరు: మండలంలో పలుచోట్ల సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉండగా సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో వాతావరణం పూర్తిగా మారిపోయింది. వర్షం, చలిగాలులకు వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

సేవలు సద్వినియోగం చేసుకోండి



ఉచిత కంటి ఆస్పత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న శిల్ప

పెనుకొండ: షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరంతరాయంగా నిర్వహించే కంటి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ ట్రస్ట్ నిర్వాహకురాలు శిల్ప పేర్కొన్నారు. పట్టణంలోని శివసాయి మందిరంలో సోమవారం ఉచిత కంటి వైద్య ఆస్పత్రిని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శిల్ప మాట్లాడుతూ గతంలో ఎన్నో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు కూడా అందజేశామన్నారు. కొంత కాలంగా వైద్య సేవలను నిలిపినా మళ్లీ నిరవధిక సేవలు అందించాలన్న లక్ష్యంతో ఆస్పత్రిని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కంటి చికిత్సలతో పాటు చెవి వినికిడి సమస్యలకు తదితర జబ్బులకు చికిత్స అందించడంతో పాటు ఆపరేషన్లు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఏజీపీ భాస్కరరెడ్డి, ట్రస్ట్ సిబ్బంది భాస్కరరెడ్డి, చిట్టిబాబు, హరి, బాబు తదితరులు పాల్గొన్నారు.

'పురం'లో పొలిటికల్ హీట్

- వైఎస్సార్‌సీపీ, టీడీపీ పోటాపోటీ సమీక్షలు
- రంగంలోకి ముఖ్య నేతలు

హిందూపురం అర్బన్: ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందే హిందూపురం నియోజకవర్గంలో రాజకీయ వేడి రాజుకుంది. వైఎస్సార్‌సీపీ, తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతల పర్యటనలు, సమీక్షలతో హడావుడి నెలకొంది. వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వారం రోజుల పర్యటన నిమిత్తం హిందూపురం వచ్చారు. సోమవారం హిందూపురం రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. టీడీపీ హయాంలో హిందూపురం నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, టీడీపీ అధినేత చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మంత్రి పెద్దిరెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు అండగా ఉండే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా చేయాలని .. అందుకు అందరూ సమష్టిగా పని చేయాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఇదే తరుణంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కూడా చాలా రోజుల తర్వాత హిందూపురం పర్యటనకు వచ్చారు. రెండు రోజులుగా హిందూపురం రూరల్ మండల గ్రామాల నాయకులతో వరుసగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే పట్టణంలోని ఓ కల్యాణ మంటపంలో నాయకులు, కార్యకర్తలతో సమీక్షలు చేస్తున్నారు. రాత్రి వేళల్లో పట్టణంలోని ముఖ్య నేతలను కలుస్తున్నారు. రెండు ప్రధాన పార్టీల ముఖ్య నేతలు పోటా పోటీగా సమీక్షలు చేస్తుండటం రాజకీయ వర్గాల్లో సెగలు పుట్టిస్తున్నాయి.

రెడ్డి జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌రెడ్డి



ప్రవీణ్‌రెడ్డికి నియామక పత్రం అందిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: రెడ్డి జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెద్దిరెడ్డిపల్లికి చెందిన ప్రవీణ్‌రెడ్డిని నియమిస్తున్నట్లు రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెడ్డి జేఏసీ కార్యాలయంలో ప్రవీణ్‌రెడ్డికి జిల్లా గౌరవాధ్యక్షుడు, ఎంపీటీసీ అంజన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డి కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్డి జేఏసీ నాయకులు నరసింహారెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీనివాస రెడ్డి, వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాల మేరకు నీరివ్వండి



జెడ్పీ ఏఈఈకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

పావగడ: కర్ణాటక హై కోర్టు ఆదేశాల మేరకు తుంగభద్ర జలాలను తాగునీటి కోసం పావగడకు అందివ్వాలని స్థానిక రాష్ట్రీయ కిసాన్ సంఘం అధ్యక్షుడు నాగభూషణరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. వెంటనే తుంగభద్ర జలాలను పావగడకు అందించకుండే పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఏఈఈ హనుమంతరాయప్పకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత జి వెంకట్రామయ్య, కిసాన్ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు అన్నపూర్ణమ్మ, రత్నమ్మ, కొడమడుగు గాయత్రి, రాజ్య యువ విభాగం అధ్యక్షుడు ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రెండో విడత ఆరోగ్య సురక్ష

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి కమ్యూనిటీ భవనం ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ చిన్నరంగప్ప తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరు కానున్నట్లు తెలిపారు. పంచాయతీ ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామ సచివాలయం- 2 పరిధిలోని గుణేపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. రోగులు తప్పనిసరిగా హాజరై శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చరిత్రను తెలియజేయడం శుభపరిణామం



ఉపాధ్యాయుడు సిద్ధగిరి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

హిందూపురం టౌన్: స్థానిక ఎంజీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సిద్ధగిరి శ్రీనివాసులు పరిశోధించి రచించిన 'నొళంబవాడి' పుస్తకం రాయలసీమ చరిత్రలో శూన్యంగా ఉన్న 8వ శతాబ్దం నుంచి 11వ శతాబ్ద కాలాన్ని నింపిందని వక్తలు కొనియాడారు. సోమవారం స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయుడు సిద్ధగిరి శ్రీనివాసులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మరుగునపడ్డ చరిత్రను పరిశీలించి, పరిశోధించి ప్రజలకు అందించడం శుభ పరిణామమన్నారు. వృత్తిపరంగా గణిత ఉపాధ్యాయుడు అయినప్పటికీ కవిత్వం, చరిత్రలను తన రచనకు అంశాలుగా ఎంచుకుని ముందుకెళ్తున్నారని శ్రీనివాస్‌ను కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సామ్రాజ్యం, వార్డు కౌన్సిలర్ రమేష్, పీడీలు లోక్‌నాథ్, సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సుపరిపాలన



జీవీపాళ్యంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మడకశిరరూరల్: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే సుపరిపాలన సాధ్యం. అన్ని వర్గాలకు అండగా ఉన్న వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంగా చేసుకుందాం' అని వైఎస్సార్‌సీపీ తాలుకా బూత్ మేనేజర్ సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ రామిరెడ్డి తెలిపారు. సోమవారం జీవీపాళ్యం గ్రామ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ లబ్ధి బోర్డును ప్రదర్శించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. సర్పంచ్ రంగనాథ్, జేసీఎస్ కన్వీనర్లు నాగేంద్రయాదవ్, నరేష్‌రెడ్డి, తిప్పేస్వామి, ఎస్సీ సెల్ నాయకులు జమ్మానిపల్లి మూర్తి, మంజునాథ్, రాజశేఖర్, వివిధ కమిటీల సభ్యులు కృష్ణారెడ్డి, ముద్దారెడ్డి, చాంద్‌బాషా, మారుతి, దొడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

సందడిగా ముగ్గుల పోటీలు

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలను నిర్వహించగా... విజేతలకు బహుమతులను అందించారు.


అధికారుల తీరుపై మున్సిపల్ ఆర్‌డీ ఆగ్రహం

మడకశిర: పట్టణంలో పారిశుధ్యం పనులపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంపై మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ పీవీవీఎస్ మూర్తి మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన సోమవారం రాత్రి ఆకస్మికంగా మడకశిర మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం గత కొన్ని రోజుల నుంచి సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన మడకశిరకు వచ్చి కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమావేశమయ్యారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో పారిశుధ్య పనులను చేపట్టడానికి ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారని అధికారులను ప్రశ్నించారు. అయితే మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పడంతో ఆర్‌డీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అలీఖాన్‌పై మండిపడ్డారు. పట్టణంలో చెత్తాచెదారం పేరుకుపోయినా మీరేం చేస్తున్నారని ప్రశ్నించారు. అలాగే పన్నుల వసూలులో వెనుకబడ్డారని అసంతృప్తి వ్యక్తం చేశారు. లక్ష్యం మేరకు పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆర్‌డీ అధికారులతో కలిసి మడకశిర పట్టణంలో పర్యటించారు. పట్టణంలో ఉన్న అన్ని ప్రాంతాల్లో కూడా 24 గంటల్లోగా పారిశుధ్యం పనులను చేపట్టాలని ఆదేశించారు. పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పరిగి: మండలంలోని ఊటుకూరు పంచాయతీ బసవనపల్లిలో అక్రమంగా కర్ణాటక మద్యం అమ్ముతున్న గోవిందప్ప అనే వ్యక్తిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. అతని వద్ద నుంచి 10 టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకొని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

'జాబిలి'కి తెలుగు భాషా సేవా ప్రతిభా పురస్కారం



పెనుకొండ: పట్టణానికి చెందిన కవి జాబిలి చాంద్‌బాషా తెలుగు భాషా సేవా ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు ఏపీ అధికార భాషా సంఘం , తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ప్రతినిధులు తనకు సమాచారం అందించారని జాబిలి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారాన్ని ఆయన అనంతపురం జేఎన్‌టీయూ ఆడిటోరియంలో మంగళవారం జరగనున్న అనంత తెలుగు భాషా వైభవం సదస్సులో ప్రముఖుల ద్వారా అందుకోనున్నారు. 25 సంవత్సరాలుగా ఆయన కవిగా, రచయితగా, ఉపాధ్యాయుడిగా సమాజానికి ఎంతో సేవ చేస్తున్నారు.

మంత్రి పర్యటనకు స్థల పరిశీలన

లేపాక్షి: మంత్రి పెదిరెడ్డి రామచంద్రారెడ్డి లేపాక్షి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పల్లెబాట కార్యక్రమంలో భాగంగా పర్యటించనున్నారు. ఇందులో భాగంగానే సోమవారం ఉదయం చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ జి.శ్రీనివాసులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. సమావేశ స్థలం తదితర ఏర్పాట్లపై ఆయన ఆరా తీశారు. జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అంజనరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9705346587
9010200238, 9912220726